# నన్ను భార్యగా స్వీకరిస్తారా?

రావిపల్లి నారాయణరావు

నన్ను చూసి చాలామంది పిచ్చివాడనుకుంటారు. ఆఫీసులో నా పనేదో నేను చేసుకుపోతాను కాని, నలుగురు చెప్పుకునే కబుర్లలో కలుగ జేసుకోను. నలిగిన దుస్తులు, పెరిగిన తల, మాసిన గడ్డం—నా ఆకారం చూసి, 'వాటీజ్ దిస్, రమాకాంత్? మనది పెద్ద లిమిటెడ్ కన్సర్న్ గదా — నేను ఓ పెన్నీ కోసమయినా గడ్డం గీసుకుని, తెల్ల దుస్తులు వేసుకుని రారాదూ?' అని అప్పు డప్పుడు ఆఫీసు మానేజర్ మందలిస్తూంటే నేను చిన్నగా నవ్వేస్తూంటాను. ఎవరు మందలించినా నేను లక్ష్యపెట్టనని ఆఫీసులో అందరికి తెలుసు. మాంబళంలో ఒక గది అద్దెకు తీసుకుని, ఎవరితోను సంబంధం పెట్టుకోకుండా ఒంటరిగా జీవితం వెలిగిస్తున్న విషయం కూడా అందరికి తెలుసు. అయితే వారికి తెలియనిదల్లా ఒక్కటే—నేను పెళ్ళి చేసుకోకపోవటానికి కారణం.

ఆదివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత మెరీనా బీచ్ జనంతో కోలాహలంగా ఉంది. అక్కడక్కడా ఉన్న దీపాల వెలుగులో చిట్టి పొట్టి పాపలు పకపక నవ్వుతూ ఆడుకుంటూంటే వారి సంతోషంలో పాలు పంచుకోవటానికేమో సముద్రంలో కెరటాలు పైకెగిరి తీరం చేరాలని ఉబలాట పడుతున్నాయి. దూరాన ఒక మూల ఎలెక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని కెరటాలను చూస్తూ కూర్చున్నాను నేను. ఎప్పుడైనా, ఎక్కడైనా ఏకాంతంగా కూర్చుంటే అమ్మాజీ గుర్తు రాకుండా ఉండదు.

పది సంవత్సరాల క్రిందట విశాఖపట్నంలో బి. ఎ. చదువుతుండగా నేను, ముగ్గురు స్నేహితులు—మోహన్, హరి, దాశరథి—కలిసి అగ్రహారం వీధిలో ఉండే మేడమీది పోర్షన్ అద్దెకు తీసుకున్నాం. నేను, హరి సముద్రంవైపు ఉన్న గదిని సెలెక్టు చేసుకున్నాం. ఆ గదికి ఆనుకుని ఉన్న బాల్కనీలో నిలబడి చూస్తే దూరాన సముద్రపు కెరటాలు, మినర్వా సినిమా టాకీసు, ఆ టాకీసుకు కొంత దూరంలో బెస్తవాళ్ళ గుడిసెలు, చుక్కల్లో చంద్రుడులా ఆ గుడిసెల మధ్య పసుపు రంగులో ఉండే ఒక చిన్న డాబా మొదలైనవన్నీ కనిపిస్తాయి. సాయంత్రం మా బాల్కనీలో నిలబడి చూస్తే నన్ను ఎక్కువగా ఆకర్షించేది—సన్నగా మల్లెపువ్వులా ముస్తాబై ఆ డాబామీద నిలబడి నా గదివైపు చూసే పదిహేడేళ్ళ అమ్మాయి. కాలేజీ నుండి రాగానే మా రూమ్‌మేట్ దాశరథి తయారు చేసి ఇచ్చిన కప్పు కాఫీ చేత పుచ్చుకుని బాల్కనీలో పచార్లు చేసే సమయానికి ఆ మల్లెపువ్వు డాబా ఎక్కి నావైపు చూసి నవ్వేది. మా ఇద్దరి మధ్య జరిగే సిగ్నల్సుని అర్థం చేసుకునేవాడేమో మా హరి పుస్తకం పుచ్చుకుని పక్క గదిలోకి వెళ్ళిపోయేవాడు.

ఒక రోజు గదులన్నీ వూడ్చేసి బాల్కనీలోకి చీపురు పుచ్చుకుని వచ్చిన కొండమ్మను అడిగాను—ఆ డాబా ఎవరిదని. పోర్టులో పనిచేసే సైడిరాజు గారు ఆ డాబా ఇంట్లో అద్దె కుంటున్నారని, ఆ డాబాకు వెనక వైపున గుడిసెలోనే తను ఉంటున్నట్లు చెప్పింది కొండమ్మ. అంత మంచి వార్త చెప్పినందుకు కొండమ్మను బంతిలా పైకెగరేసి పట్టుకోవాలనిపించింది కాని, ఆ పని నేను చెయ్యలేకపోయాను. కొండమ్మ చిన్నదైనా, మా గదులు వూడ్చే పని మనిషి. మనిషి అందంగా కనబడ్డా, వేసుకున్న గుడ్డలు మట్టికొట్టుకుని ఉంటాయి. మెలికలు తిరిగే కేసరాలు ఆమె ముఖానికి నూతన శోభను తెచ్చినా, వాటికి నూనె పూసి పది రోజులు పైబడి ఉండవచ్చు.

నా సంతోషాన్ని ఎలా వ్యక్తపరచాలో తెలియక—'వెరీ ఫైన్, కొండమ్మా!' అన్నాను.

'వెరీ ఫైన్ అంటే ఏంది, బాబూ?' నా ముఖంలోకి అమాయకంగా చూసింది కొండమ్మ.

'వెరీ ఫైన్ అంటే చాలా బాగుంది అని అర్థం. అది సరే, ఆ డాబా ఇంట్లో ఎవరు పని చేస్తున్నారు?' అని అడిగాను.

'ఆ డాబా ఇంట్లోనా అండి? ఇంకెవ రూడుస్తారు! నానేనండి. ఆ సైడిరాజుగారు నన్ను మానిపించేసి మరో పనిమనిషిని చూసుకోవా లనుకున్నారండి. కాని, అమ్మాజీగారు ఒప్పుకోలేదు.'

'అమ్మాజీ....?'

'అమ్మాజీ గారంటే ఆరి పెళ్లాలండి!'

'అంటే... సాయంత్రం డాబా ఎక్కి దేవకన్యలా చూస్తుంటాది.'

'దేవకన్యంటే ఏంటిదండి?'

'దేవకన్యంటే సినిమా హీరోయిన్‌లే!'

'అవునండి. అట్లాగే ఉంటారు మా అమ్మాజీగారు.'

'అది సరే. మరి మీ అమ్మాజీ డాబా ఎక్కి ఇటువైపు రోజూ ఎందుకు చూస్తుంది? చూసి ఎందుకు నవ్వుతుంది?'

గలగలా నవ్వింది కొండమ్మ.

ఎంత చక్కగా ఉంది పలువరుస! తెల్లగా ముత్యాల్లా మెరిసిపోతున్నాయి పళ్ళు.

తలకు నూనె రాసి, జడ వేసుకుని, అందమైన దుస్తులు కట్టుకుంటే బాల హీరోయిన్‌లా ఉండదూ కొండమ్మ!

'ఏటి, బాబూ, అట్టా సూత్తారు? మొన్న ఏటైందనుకున్నారు? మా ఎనక గుడిసెలో రామిగాడు నేడూ? ఆడు నా జడలాగి, 'కొక్కిరమ్మా', 'కొక్కిరమ్మా' అని నన్ను ఎక్కిరిస్తే మక్కె లిరగ తన్నాడు మా అన్న. ...అప్పటినుండి నా దిక్కు సూడ్డం మానేసేడు రామిగాడు.'

కొండమ్మ సూపర్ ఎక్స్‌ప్రెస్ స్పీడులో చెప్పుకుపోతూంది.

'అదీ సరే. నే నడిగిన ప్రశ్నకు జవాబు చెప్పవేం? అదే మీ అమ్మాజీగారి విషయం.'

'అవును, అడిగారుకదూ! మీవాగే అడిగింది ఆ అమ్మాజీగారు. ఆయన గది నువ్వూడుస్తున్నావు కదా—మరి అయ నెప్పుడూ బాల్కనీలో నిలబడి మా డాబావైపు ఎందుకు సూత్తాడని.'

'అడిగిందా ?! మరి ఆ విషయం వెంటనే ఎందుకు చెప్పలేదు?'

'మరిసిపోనానండి. ఇంతలో మీరే అడిగారు గందా!'

'అయితే ఒక పని చేస్తావా?'

ఏమిటన్నట్టు నా మొహంలోకి చూసింది.

'నే నొక ఉత్తరం రాసిస్తాను. అది ఇచ్చేసి రావాలి.'

'యారికి, సైడిరాజుగారికా?'

'చచ్చాం పో...ఏమిటే, కొండమ్మా, నీకు కొంచెమైనా కామన్సెన్స్ లేదు.'

'కామానెసెన్స్ అంటే ఏంటిదండి?'

'ఆ అర్థం నీకు తెలవదులే. నువ్వు నేను రాసిస్తున్న ఉత్తరం సైడిరాజుకీ, కోడిరాజుకీ కాదు ఇవ్వవలసింది. అది ఎవరూ చూడకుండా తిన్నగా తీసుకువెళ్ళి మీ అమ్మాజీగారికి ఇవ్వాలి.



తెలిసిందా ?'

చక్రాల్లాంటి కళ్ళు గుండ్రంగా తిప్పి తెలిసిందన్నట్టు తల వూపింది కొండమ్మ.

'చూడు—అమ్మాజీ ఏదైనా ఉత్తరం నీకు ఇవ్వవచ్చు. ఆ ఉత్తరం తీసుకుని వచ్చి నా చేతికి ఇవ్వు. మరెవ్వరికీ ఇవ్వవద్దు. ఆ దాశరధిగాడు దేవాంతకుడు—అనలిస్తే పేగులు లెక్క పెడతాడు. తెలిసిందా?'

'తెలిసిందండి. మీరు నేకపోతే దాశరధిగారి పేగులు లెక్క పెట్టాలి. అంతేగదండి?' తల ఎత్తి నవ్వింది.

నా తల రెండు చేతులతో పట్టుకుని— 'కొండమ్మా! ముందలా మాటాడకుండా కూర్చో. ఉత్తరం ఇస్తాను. తీసుకువెడుదువుగాని' అని కాగితం, పెన్ను తీసుకుని నాలుగు ముక్కలు వ్రాసి కొండమ్మ చేతిలో పెట్టాను. ఆ ఉత్తరం పట్టుకుని నోరెత్తకుండా మెట్లు దిగింది కొండమ్మ.

ఆ మర్నాడు నేను కాలేజీనుంచి వచ్చేసరికి వరండాలో నా రాకకు ఎదురు చూస్తూ కూర్చున్న కొండమ్మ లేచి నిలబడింది.

'కాయా, పండా?' గది తలుపు తెరుస్తూ అడిగాను.

'అంత తొందరేటి? పక్క గదిలో దాశరధిగారున్నారు' అంటూ కాళ్ళకీనమైపు జరిగి, అటు ఇటు చూసి బొడ్డులో దోపిన ఉత్తరం తీసి నా చేతిలో పెట్టి తలుపు సందున ఉన్న చీపురు అందుకుంది—గది వూడ్వడానికి.

ఆ తర్వాత కొండమ్మ చీపురు పుచ్చుకుని పక్క గదిలోకి వెళ్ళగానే గది తలుపులు మూసి అమ్మాజీ పంపిన ఉత్తరాన్ని మెల్లగా విప్పి చదివాను.

'రమాకాంత్ గారికి! నమస్కృతులు. మీ ఉత్తరం చదివాను. ఈరోజు సాయంత్రం సరిగ్గా ఏడు గంటలకు మినర్వా టాకీసుకు ఎదురుగా ఉన్న ఇసుక దిబ్బలపైన కూర్చుని ఉంటాను. మీరు వస్తే ముఖాముఖంగా అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు. సెలవు పుచ్చుకోనా మరి? మ్మాజీ.'

నా ఉత్తరానికి అంత తొందరగా అమ్మాజీ దగ్గరినుంచి జవాబు వస్తుందని నే వూహించలేదు. చీకటిపడేవరకు నిమిషాలను లెక్కిస్తూ, ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివానో గుర్తులేదు.

నీటుగా ముస్తాబై ఏడుగంటల సమయానికి బీచ్ కి వెళ్ళాను. ఇసుక దిబ్బలమీద కూర్చుని అమ్మాజీ నాకోసం ఎదురు చూస్తూంది.

ఆ సాయంత్రం మొదటి సమావేశంలో మా ఇద్దరి మధ్య ఎన్నో సంగతులు దొర్లాయి. సముద్రంలోని కెరటాల్లా మా మనసులు పట్టలేని ఆనందంతో ఉప్పొంగిపోయాయి. జీవితంలో మరవలేని అనుభూతిని పొందాను నే నారోజు.

మా ఇద్దరి మధ్య ఏర్పడిన సంబంధం నా రూమ్మేట్స్ అందరికీ తెలిసిపోయింది. ఆ వూళ్ళో అక్కడక్కడా మా ఇరువురి గురించే చర్చించుకోవడం కూడా నేను విన్నాను. అయినా నేను భయపడలేదు. అసలు నే నెందుకు భయ

పడాలి? అమ్మాజీని నేను త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాను. ఆ విషయం రూమ్‌మేట్స్ అందరికీ చెప్పాను.

మా ఇద్దరి మధ్య రాయబారం నడిపే కొండమ్మ కొన్ని నెలల్లోనే ఒళ్ళు చేసింది. అమ్మాజీ కుట్టించిన దుస్తుల్లో కాశ్మీర్ ఏపిల్‌లా మున్నగా, బంగారపు బొమ్మలా కనిపించేది.

ఒక రోజు—ఆదివారం అనుకుంటాను—నేను బాల్కనీలో కుర్చీ వేసుకుని కూర్చుని చదువుకుంటున్నాను. మిట్టమధ్యాహ్నం, ఒంటి గంట దాటింది. క్రిందనున్న అందరి గదులు దాటుకుని మేడ మెట్లెక్కి తిన్నగా నా గదిలోకి వచ్చింది అమ్మాజీ. ఆమెను చూడగానే గదిలో ఒక మూల పరుపుమీద పడుకుని పుస్తకం చదువుతున్న హరి లేచి క్రింద గదివైపు పరుగెత్తాడు. వాడు వెళ్ళగానే గది తలుపులు దగ్గరగా వేసి కుర్చీలో కూర్చున్న నన్ను రెండు చేతులతో గట్టిగా వాటేసి దగ్గరగా తీసుకుని వలవలా ఏడ్చేసింది అమ్మాజీ.

ఆమె కళ్ళలో నీళ్ళు చూశాక నా మనస్సు చివుక్కుమంది.

'ఛ...ఛ! ఇదేమిటి, అమ్మాజీ, ఇప్పుడేమైంది? నే నేమైనా తప్పుగా ప్రవర్తించానా? రూమ్‌మేట్స్ ఏమైనా అన్నారా? ఎప్పుడూ లేనిది ఇప్పుడెందుకు కళ్ళలో నీళ్ళు పెట్టుకుంటున్నావ్?'

'నేను ఆడదాన్ని—అంతకన్న నేనేం చెయ్యగలను? నువ్వు మగాడివి—నీకేం...' కళ్ళు తుడుచుకుంది.

'ఇంతకీ ఇప్పుడేం జరిగింది, మేడమ్? నే నుండగా నీ కెందుకీ దిగులు? చెప్పు, ఏం జరిగింది?'

'మన సంగతి మా అన్న చెవిని పడిందనుకుంటాను—నా పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు. మంచి మంచి సంబంధాలకోసం తిరుగుతున్నాడు.'

ఎక్కడో పిడుగుపడినట్టు అదిరిపోయాను. నా పంజరంలోని చిలుకను ఎవరో ఎగరేసుకుపోతున్నట్టు బాధపడ్డాను. నా ఆందోళనను వ్యక్తపరచకుండా మనసును అదుపులోకి తెచ్చుకుని..

'మరేం గాభరాపడకు. మీ అన్నదగ్గరకు వచ్చి చెబుతాను—నేను పెళ్ళి చేసుకుంటానని. సరేనా?' అని ఆమె భుజంమీద చెయ్యి వేస్తూ అన్నాను.

'వద్దు, రమాకాంత్, మా అన్న దగ్గరకు రావద్దు. మా అన్న ముక్కోపి. అన్ని విషయాల్లోను నాకు స్వతంత్రం ఇచ్చాడు కాని, పెళ్ళి విషయంలో మాత్రం జోక్యం చేసుకోవద్దన్నాడు. పెళ్ళికి ముందే నువ్వూ, నేనూ చెట్టాపట్టాలేసుకు తిరుగుతున్నట్టు తను గ్రహించాడు. ఆ నేరంలో నేను కూడా భాగస్వామినైనా, తప్పంతా నీమీదే తోసేయడానికి ఏమాత్రం వెనకడుగు వేయడు మా అన్న. వాడి బుద్ధి ఎప్పుడెలా ఉంటుందో నేను కూడా చెప్పలేను. మనుషుల ప్రాణాలు తియ్యడానికి కూడా సిద్ధపడతాడంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.'

ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. ముఖం నిర్జీవమైపోయింది. చెక్కిళ్ళు కన్నీటితో తడిసిపోతున్నాయి.



పై పైకి

— మోహన్‌రెడ్డి

'అయితే, నన్నిప్పుడు ఏం చెయ్యమంటావ్?' ఆమె చెక్కిళ్ళు నిమురుతూ అన్నాను.

'నువ్వు నన్ను పూర్తిగా మరిచిపోవాలి. అదే నువ్వు చెయ్యవలసిన పని. నా కోసం నువ్వు ఎక్కడికీ రావద్దు. ఎక్కడా ఎదురు చూడవద్దు. నే నిక పంజరంలోని పక్షిని. అన్నయ్య వచ్చే వేళైంది. నేను వెళతాను.'

నా జవాబుకోసమైనా ఎదురు చూడకుండా గబగబా మెట్లు దిగి రోడ్డువైపు పరుగెత్తింది అమ్మాజీ. ఆమె వెళ్ళినవైపు చూస్తూ స్థాణువులా నిలబడిపోయాను కొన్ని క్షణాలు.

కాలచక్రంలో కొన్ని నెలలు గడిచిపోయాయి. అమ్మాజీ జాడ కనబడలేదు. కొండమ్మ గది వూడ్చడానికి రావడం మానేసి చాలా రోజులైంది.

ఒక రోజు కురుపాం మార్కెట్టు దగ్గర కొండమ్మ కనబడి పలకరించింది. చూచిన వెంటనే ఆమెను నేను గుర్తుపట్టలేకపోయాను. ఆమె అవయవపు పొంగుల్లో తెలియని ఆకర్షణ చోటు చేసుకుంది. ఆమె అలంకరణలో కూడా ఎదుటి వారిని ఇట్టే ఆకర్షించే లక్షణాలు పొడగట్టాయి. గలగలా సెలయేటి ప్రవాహంలా మాట్లాడేస్తూందిప్పుడు. మాటల్లో ఆమె చెప్పింది—అమ్మాజీ పెళ్ళి షిప్‌యార్డు కంపెనీలో పనిచేసే ఒక సూపర్‌వైజర్‌తో జరిగిపోయిందని, పెళ్ళి జరిగిన రెండు నెలల్లోనే కంపెనీలో జరిగిన ఏక్సిడెంట్‌లో ఆమె భర్త చనిపోయాడని.

పెళ్ళి జరగడం, ఇంతలోనే భర్త పోవడం, నేను అవాక్కయిపోయాను. నే నా షాక్‌నుండి తేరుకోకముందే కొండమ్మ చెప్పింది—

'అమ్మాజీగారు ఈ వూళ్ళో లేరు. మనసు దిగులు తగ్గడానికి మరో వూరికి పంపడమే మంచిదని వాళ్ళ బాబాయిగారి వూర్లో వదిలేసి వచ్చాడు వాళ్ళన్న.'

'ఏ వూరు?' ఆత్రుతగా అడిగాను.

'ఏమో ? తెలీదు.' పెదవి విరిచింది కొండమ్మ.

'అది సరే, మరి నువ్వెందుకు ఇల్లు వూడ్చడానికి రాలేదు?'

'మా అన్న ఒద్దన్నాడు. వెళితే మక్కెలిరగ తన్నుతానన్నాడు. మరి వాడి తాగుడికి డబ్బులు నే నెక్కడినుండి తెచ్చేది? స్టూడెంట్ కుర్రోళ్ళయితే నెల జీతంకాక రోజుకు రెండో మూడో పడేస్తారనుకున్నాడట. మరి, నేను మీ గది వూడ్చినన్నాళ్ళూ ఒక పావలా డబ్బులైనా రోజూ వాడి మొహాన పారేయలేదు అందుకే మీ గది వూడ్వడానికి పోవద్దని ఆర్డరేశాడు.'

నేను కొన్ని క్షణాలు మౌనంగా నిలబడిపోవడం చూసి— 'చీకటి పడిపోయింది, నేను వెళ్ళొస్తానండి' అంటూ కొండమ్మ పమిట సర్దుకుని గబగబా ముందుకు దూసుకుపోయింది.

ఆ తర్వాత కొద్దిరోజులకే నే నా వూరు విడిచిపెట్టాను.

ఆ సంవత్సరం నా చదువు పూర్తి అయింది. మళ్ళీ నేను విశాఖపట్నం వెళ్ళలేదు. పెళ్ళి చేసుకొమ్మని అమ్మ, నాన్న పట్టుపట్టారు. ఉద్యోగం లేదని మొదట చేసుకోనన్నాను. తర్వాత మద్రాసులో ఒక సైకిల్ కంపెనీలో అక్కౌంటెంట్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో ప్రవేశించిన మొదటి రోజుల్లో ప్రతి ఉత్తరంలోను నా పెళ్ళి విషయం వ్రాసేవారు నాన్న. కాని, నేను పెళ్ళి చేసుకోనని మొండిపట్టు పట్టడంతో ఆ విషయం డ్రాప్ చేసుకున్నారు.

చల్లగాలిలో చిన్న జల్లు ప్రారంభమైందేమో బీచ్‌లో కోలాహలం బయలుదేరింది. పిల్లలు, పెద్దలు రోడ్డువైపు పరుగు లంకించుకున్నారు. అటు మెరీనా కాంటిన్‌వైపో, ఇటు రోడ్డు క్రాస్ చేసి ట్రిప్లికేన్ బస్సు స్టాండువైపో పరుగెడితే కాని తల దాచుకోవటానికి చోటు ఉండదు. నేను గబాలున లేచి తలమీద రుమాలు వేసుకుని ఇసుక దిబ్బలు వదిలి రోడ్డునపట్టాను. రెండడుగులు వేశానో లేదో, ఎదురుగా వచ్చిన టాక్సీ సడెన్ బ్రేక్‌తో నా ముందు ఆగింది. టాక్సీ లోపల లైటు వెలుగుతూంది. వెనక సీట్లో కూర్చున్న వయసులో ఉన్న స్త్రీ అందంగా అలంకరించుకునుంది. నన్ను చూసి చిన్నగా నవ్వింది.

'నన్ను గుర్తుపట్టలేదా, రమాకాంత్‌గారూ?' అని అడిగింది ఆమె.

ఎక్కడో చూశాను. చూసినట్టే గుర్తు. కాని,

ఎక్కడో గుర్తు రావటం లేదు. ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాను కొన్ని క్షణాలు. తర్వాత గుర్తొచ్చింది.

'నువ్వు....కొండమ్మవుగదూ?!' మెల్లగా అన్నాను.

'అవును. పదేళ్ళ క్రిందట కొండమ్మనే. కాని, ఇప్పుడు కాదు. ఇప్పుడు నా పేరు జయకోకిల. లోపలకు రండి. జల్లుపడుతోంది.' టాక్సీ డోర్ తెరిచి తన పక్కసీటు చూపింది. నేను లోపల కూర్చోగానే టాక్సీ కదిలింది.

కొండమ్మ—అంటే జయకోకిల — పాలరాతి బొమ్మలా కనిపిస్తూంది. ఖరీదైన చీర కట్టింది. జడలో మల్లెపూలు, చీరకు పులిమిన సెంటు గుబాళిస్తున్నాయి. పెదాలకు ఎర్రరంగు రాసింది. నుదుటిపై తిలకం దిద్దింది. అప్పటి కొండమ్మకు, ఇప్పటి జయకోకిలకు ఎంత భేదం! గడుల పూడ్చి పొట్ట పోషించుకునే కొండమ్మ ఎంతపైకి ఎదిగిపోయింది!! ఈమె మద్రాసు ఎప్పుడు వచ్చింది? నేను నోరు తెరచి అడగబోయే సరికి ఆమె నావైపు తిరిగి చెప్పడం ప్రారంభించింది—

'నేను పనిమనిషిలా జీవించడం మా అన్నకు నచ్చలేదు. నేను బాగా ఎదిగాక నన్ను సినిమాల్లో చేర్పించి డబ్బు చేసుకోవాలన్న ఆశ కలిగింది. నేను ఇష్టపడలేదు. కాని, బలవంతంగా నన్నిక్కడికి ఈడ్చుకొచ్చాడు. మొదట్లో ఇక్కడి మనుషులు, వాతావరణం నాకు నచ్చలేదు. ఇప్పుడిప్పుడే వాటికి అలవాటు పడ్డాను. జీవితం యాంత్రికంగా సాగుతూందన్నమాటే కాని, ఇప్పుడు నాకు దేనికీ తక్కువలేదు. అన్ని ఉన్నా...'

ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

'ఆగిపోయావేం?' ఆమె మొహంలోకి చూశాను.

'చెబుతున్నాను. అన్ని ఉన్నా, నాకు సుఖంలేదు. నన్ను ఒక మనిషిగా గుర్తించి మనస్సు అర్థం చేసుకునే వ్యక్తి నా చెంతనుంటే నేనెంతో సంబరపడేదాన్ని. ప్రతి స్త్రీకి ఒక మగతోడు అవసరం. అదే నాకు తక్కువైంది. అన్న ఉన్నాడు— ఎందుకు? వాడికి నా కష్టసుఖాలు అక్కర్లేదు. నేను సంపాదించిన డబ్బు వాడి చేతిలో పెడితే చాలు— ఈ లోకాన్నే మరిచిపోతాడు. ఇక నా చుట్టూ తిరిగే మనుషులకు నా అందం కావాలి. నా అందంతో ఆడుకుంటూ నాకు సినిమాల్లో వేషాలు సంపాదిస్తారు వాళ్ళు. నేనిప్పటికి పది చిత్రాల్లో నటించాను. ఈమధ్య అడయార్‌లో కట్టిన ఇంటికి బస మార్చాను. రమాకాంత్‌గారూ! నేనొక్కటి అడుగుతాను— నిజం చెబుతారా?' నా కళ్ళలోకి సూటిగా చూసింది.

'నేనెప్పుడూ అబద్ధం చెప్పలేదు' అన్నాను నేను


'మీరు పెళ్ళి చేసుకోలేదు. ఎందుచేత?'

'ఆ విషయం నీకెలా తెలుసు?'

'తెలుసుకున్నాను. మొన్న నీమధ్య మీ రూమ్‌మేట్ దాశరథి షూటింగ్ చూట్టానికి మా ఫ్లోర్‌కి వచ్చాడు. అతను చెప్పాడు.'

'అవును. అతను చెప్పింది నిజమే. నేను పెళ్ళి చేసుకోలేదు.'

'కారణం?'




'నేను జీవితంలో ఒకరికే మనసిచ్చాను. మళ్ళీ నా హృదయంలో మరొకరికి స్థానం లేదు.'

'నేను మీ మనస్సుని పూర్తిగా అర్థం చేసుకున్నాను. అయినా మిమ్మల్ని అడుగుతున్నాను, నన్ను భార్యగా మీరు స్వీకరిస్తారా? అహం పేరుకు మాత్రమే. చూడండి బంగారు పళ్ళానికైనా గోడ చేరువు అవసరం. అలాగే తాడులేని బొంగరంలాంటి నా జీవితానికి ఒక మగదిక్కు అవసరం. నాకు మీలాంటోడు కావాలి. నేనిలా అడుగుతున్నానని మరో విధంగా అనుకోవద్దు. మీ సహృదయాన్ని చిన్నప్పటి నుండి అర్థం చేసుకునే మనిషిని కాబట్టి నేను ఇంత నిర్మొగమాటంగా అడగ గలుగుతున్నాను." ఆమె చూపుల్లోని దైన్యం నా మనసుని కరిగించి వేసింది.

అడయారు రోడ్డు పట్టింది టాక్సీ. ఎదురుగాలికి మెలికలు తిరిగిన ఆమె కురులు నుదుటిపై నడి నాట్యం చేయసాగాయి.

'సరే' అన్నాను నేను.

ఆమె కళ్ళలో వెయ్యి కాంతులు వెలిగి పట్టుయింది.

ఆమె సంభాషణ మళ్ళీ కొనసాగించింది.

'పాపం! అమ్మాజీ బాగా చితికిపోయింది. భర్తపోయిన రెండేళ్ళలోనే అన్నయ్య చనిపోవడం, అప్పులు తీర్చటానికి ఉన్నపాటి కొద్ది ఆస్తిని అమ్ముకోవలసి రావడం— ఆమె ఏదో ఒక చిన్నపాటి ఉద్యోగం చూసుకోకతప్పలేదు. కనీసం హైస్కూలు విద్య అయినా పూర్తిచేయలేకపోయానని ఆమె చాలా బాధపడింది. బాగా బ్రతికిన పూళ్ళో చిన్న ఉద్యోగం చేయుడానికి మనసు అంగీకరించ లేదు. అందుకే ఆమె ఆ పూరు విడిచి వెళిపోయింది.'

నా ముఖంలోని రంగుల మార్పుని ఆమె గ్రహించిందేమో సంభాషణకు ఫుల్‌స్టాప్ పెట్టింది. మరి కొన్ని క్షణాలలో టాక్సీ ఒక పెద్ద బంగళా ముందు ఆగింది. టాక్సీ హెడ్‌లైట్లు కాంపౌండు గోడ దాటుకుని లోపల ప్రవేశిస్తున్నప్పుడు ఆ గేటు స్తంభంపై 'జయకోకిలా, సినీ ఆర్టిస్టు' అని వ్రాయబడి ఉన్న నేమ్‌ప్లేట్ నా దృష్టినుండి తప్పుకోలేదు.

ఆ రాత్రి భోజనం ముగించి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి సోఫాలో కూలబడ్డాను. పక్కనున్న షోకేస్‌లో ఉన్న ఫొటో ఫ్రేమ్‌లో నా ఫోటో, దాని పక్క అమ్మాజీ ఫోటో ఉండడం చూశాక అనుకోకుండా నా కళ్ళు చెమ్మగిల్లాయి. మా ఇద్దరిపై కొండమ్మకెందుకో ఇంతటి అభిమానం! మనసులో కొండమ్మను అభినందించకుండా ఉండలేకపోయాను. అలా ఆలోచిస్తూ తల పక్కకు తిప్పానో, లేదో అప్పుడే తలుపు తెరుచుకుని లోపలికి ప్రవేశించింది అమ్మాజీ!

అదేమీ గారడీ కాదుగదా?! నా చేతిని ఒకసారి గిల్లుకుని మరోసారి తల ఎత్తి చూశాను. నిజంగా అమ్మాజీయే! అబద్ధం కాదు. ఆమె నా పాదాల మీద వాలిపోయింది—కళ్ళలో నీళ్ళు పెట్టుకుంటూ. ఆమెను పైకి లేవనెత్తి సోఫాలో నాపక్కను కూర్చోపెట్టగానే జయకోకిల లోపలికి వచ్చి చెప్పింది.

'రమాకాంత్‌గారూ! నా జీవితంలో మీ ఇద్దర్నీ ఇలా ఒకే గదిలో మళ్ళీ చూస్తాననుకోలేదు. ఈ క్షణంకోసం నేను ఎప్పటినుండో ఎదురు చూస్తున్నాను. విష్‌యు ఎ హాపీ నైట్!' అంటూ బయటికి వెళ్ళి తలుపు మూసింది. ★